క్లుప్తంగా

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

జగిత్యాల: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎం రామానుజం అన్నారు. సోమవారం గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వకృత్వ పోటీల్లో గరల్స్ హైస్కూల్ విద్యార్థినులు అత్యంత ప్రతిభ కనబర్చి మొదటిస్థానంలో నిలిచారు. ఈసందర్భంగా వారిని అభినందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి ఏదో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానిని సాధించే దిశగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బోనగిరి దేవయ్య, జయశ్రీ, రజాక్, రజిత, శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఉపాధి కల్పించాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు పేద ప్రజలకు ఉపాధి కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ శివ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు పేద ప్రజలకు ఉపాధి, విద్య, వైద్యం, భూమి, ఇల్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కో–కన్వీనర్ అరుణ్, తిరుపతి, ఉపేంద్ర, గంగరాజం, కోటేశ్, ప్రణీత్, అనుదీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



హాస్టల్ గదులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

కథలాపూర్: పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మండల వైద్యాధికారి సింధూజ అన్నారు. సోమవారం కథలాపూర్‌లో కేజీబీవీ హాస్టల్‌ను పీహెచ్‌సీ వైద్యులు, వైద్యసిబ్బంది పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం పట్ల విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 45 మందికి చికిత్సలందించి మందులు అందించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎం శిరీషా, ప్రత్యేకాధికారి లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులు అధైర్యపడొద్దు



వృద్ధులను సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల: వృద్ధులు అధైర్య పడకుండా ధైర్యంతో బతకాలని వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం అన్నారు. పట్టణంలోని వృద్ధుల సంక్షేమ సంఘంలో సోమవారం వృద్ధులను దుప్పట్లతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వృద్ధులు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కుటుంబంలో ఎలాంటి సమస్యలున్నా తమకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాచకొండ దేవయ్య, బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్, రాస భూమయ్య, చింత భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ఆటాపాట



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్, గంభీర్‌పూర్ గ్రామాల్లో సోమవారం సారధి కళాకారులు ప్రభుత్వ పథకాలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రజలు సుపరిపాలన అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, కళాకారులు పర్శురాం, మహిపాల్, రాజేందర్, ప్రవీణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

18 వేల కోట్ల రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ఏకకాలంలో రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పొన్నాల గార్డెన్స్‌లో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాలకు చెందిన 148 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.100 కోట్లతో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ను చల్‌గల్‌లో ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, గడ్డం నారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, జాన్, గంగాధర్ పాల్గొన్నారు.

యాంటి బయటిక్స్ అతిగా వాడొద్దు

జగిత్యాల: వైద్యులు యాంటిబయటిక్స్ రాయడాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం యాంటిబయటిక్స్ రెసిస్టెన్స్ తగ్గించడం ఎలా అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మోర సుమన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

టీఆర్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

టీఆర్‌నగర్‌ను ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం టీఆర్‌నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, గిరి నాగభూషణం, చాంద్‌పాషా, దేవేందర్‌నాయక్, ఏఈలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

రాయికల్: పట్టణంలో నూతన గౌడ సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ సంఘం అభ్యున్నతి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం అండ

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బాధిత కుటుంబానికి ప్రొసీడింగ్ ఇస్తున్న ఎమ్మెల్యే

కొండగట్టు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.సోమవారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి,డబ్బు తిమ్మాయపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు గల్ఫ్ కార్మికులు మృతి చెందగా వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల ప్రొసీడింగ్ ను సత్యం అందజేశారు. అనంతరం కొడిమ్యాల జీపీ ఆఫీస్ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ స్వర్ణలత, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

రాత పరీక్షలేకుండా ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో రెండో ఏఎన్‌ఎంలుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఏఎన్‌ఎంలు వినతిపత్రం అందించారు. కలెక్టరేట్ ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. రెండో ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల మధురిమ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని నియమించగా ఇప్పటికీ సమావేశం కాలేదన్నారు. సర్వీస్ ప్రకారం వయోపరిమితి ఎత్తివేసి ఎలాంటి రాత పరీక్ష లేకుండానే తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎక్స్‌గ్రేషియా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు సాదుల వసంత, నీరజ, పద్మ, స్వరూప, జ్యోతి, మధులత, సుప్రియ, ఉజ్వల, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి



మేడిపల్లిలో నిరసన తెలుపుతున్న నాయకులు

సారంగాపూర్: జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూడూరి శోభన్ అన్నారు. సోమవారం సారంగాపూర్‌లో మాట్లాడారు. జగిత్యాల నడిబొడ్డున ఉన్న విగ్రహాన్ని ధ్వంసం చేయడం వెనుక ఎంతటి వారు ఉన్నా వారిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విగ్రహానికి తక్షణమే ప్రభుత్వం మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో అంబేడ్కర్ సంఘాల నాయకులు మాలెపు సుధాకర్, లక్ష్మీరాజం, గంగాధర్, శంకర్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఠాణాలో అంబేడ్కర్ సంఘం నాయకుల ఫిర్యాదు

కథలాపూర్: జగిత్యాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాల సంఘం నాయకులు కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మేడిపల్లిలో నిరసన

మేడిపల్లి: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ లేనప్పుడు దళితులకు ఎలా రక్షణ ఉంటుందని వారు వాపోయారు. దుండగులను కఠినంగా శిక్షించాలని లేని యెడల పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భీమారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిలివేరి వెంకటేష్, మేడిపల్లి ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మకిలి సురేష్ ,బహుజన వేదిక మాజీ అధ్యక్షుడు చిట్యాల అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో విద్యార్థికి బంగారు పతకం

ధర్మపురి: మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాల విద్యార్థి అథ్లెటిక్స్ 300 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన హర్షిత్ ఈనెల 20 న మెట్‌పెల్లిలో జరిగిన జిల్లా స్థాయి వీ–10 విభాగంలోని 300 పరుగుపందెంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, పీఈటీలు కల్పన, సంతోష్ ఉపాధ్యాయులు అభినందించారు.

- **కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు**

కోరుట్ల: పట్టణంలోని మన కోరుట్ల ఒకీనావ స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కు చెందిన 9 మంది విద్యార్థులు 15 పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ అల్లె రమేశ్ సోమవారం తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో కటా, కుమ్మితే క్యాటగిరిలో కోరుట్ల విద్యార్థులు 8 బంగారు, 4 వెండి,3 కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ అల్లె రమేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌కు సన్మానం

మల్యాల: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియామకమైన గుమ్మడి వెన్నెలను మండల కేంద్రానికి చెందిన కళాకారుడు మల్యాల సతీశ్ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో ఆట,పాటలతో ఉద్యమించిన కళాకారులందరికీ ఉపాధి చూపాలని కోరారు.

- **దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్‌లో ఆదివారం రాత్రి స్వీట్‌హౌస్‌లో దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మోహన్ తెలిపారు. మార్కెట్‌లో స్వీట్ హౌస్ నిర్వహించే టంకు పూనెల్ దుకాణంలో ఉండగా ఓ మహిళతో పాటు, రాజు, బిట్టు, సాగర్, తిరుపతి దుకాణానికి వచ్చి గొడవ పడి పూనెల్‌పై దాడి చేశారు.సెల్‌ఫోన్ కూడా లాక్కెళ్లారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

- **బాలుడిపై కేసు..**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అమీనాబాద్‌లో సోమవారం పాతకక్షలను మనసులో ఉంచుకుని కత్తితో దాడిచేసిన బాలుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు. అమీనాబాద్‌కు చెందిన రహమాన్‌తో బాలుడు గొడవ పడుతుండగా రిజ్వాన్, ఇర్ఫాన్ అనే వ్యక్తులు గొడవను ఆపేందుకు వెళ్లగా, సదరు బాలుడు రిజ్వాన్‌పై కత్తితో దాడిచేశాడు. దీంతో స్థానికులు ఆయనను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దాడి చేసిన బాలుడిపై కేసు నమోదు చేసి జువైనల్ కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

- **మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 10 రోజుల జైలు**

జగిత్యాలక్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై మల్లేశం అన్నారు. సోమవారం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఇటీవల నజీర్ ఉస్మాన్ షేక్ వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడుపగా కేసు నమోదు చేశామని, అతడిని సోమవారం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ ఎదుట ప్రవేశపెట్టగా నిందితుడికి 10 రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

- **ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ**

ధర్మపురి: ధర్మపురి ఎస్సైగా ఉదయ్‌కుమార్ సోమవారం తన బాధ్యతలు చేపట్టారు. ఎస్సై ఉదయ్‌కుమార్ ఆదిలాబాద్ నుంచి ధర్మపురి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఎస్సైగా పనిచేసిన మహేశ్ స్థానంలో నూతనంగా ఉదయ్‌కుమార్‌ను నియమించారు.

- **కొండగట్టులో పూణే ఈపీఎఫ్‌వో అడిషనల్ కమిషనర్ పూజలు**

కొండగట్టు: కొండగట్టు ఆంజనేయ స్వామివారిని సోమవారం పూణే ఈపీఎఫ్‌వో జోనల్ అడిషనల్ కమిషనర్ ఎం.ఎస్.కెవీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.

- **పోస్టర్ ఆవిష్కరణ**

జగిత్యాల: దళితుల హక్కుల కోసం సమరశంఖారావం పూరించడానికి జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జాతీయ మహాసభలు జరుగుతున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్ అన్నారు. సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హన్మంతు, సురేశ్, రాంబాబు పాల్గొన్నారు.

కథలాపూర్: వచ్చే నెల 1న మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే 'ఛలో హైదరాబాద్' వాల్‌పోస్టర్‌ను మాల సంఘం నాయకులు సోమవారం కథలాపూర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు జంగం నరేశ్, తలారి మోహన్, కోట శంకర్, రాధకృష్ణ, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్

రాయికల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. సోమవారం రాయికల్ మండలం జగన్నాథపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడెం భీం, బీర్నాబ్ పాల్గొన్నారు.

డ్రోన్ల వాడకంపై నేడు రైతులకు అవగాహన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు డ్రోన్‌ల వాడకంపై అవగాహన కల్పించనున్నట్లు ఏవో రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. రైతువేదికలో ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన ప్రారంభమవుతుందని, రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు పెగడపల్లిలో ప్రభుత్వ విప్ పర్యటన

పెగడపల్లి: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పెగడపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒరుగల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ సోమవారం తెలిపారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



వ్రత పూజల్లో పాల్గొన్న దంపతులు

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద విద్య సామ్రాట్ బ్రహ్మశ్రీ తిప్పర్తి సత్యాచార్యులు మంత్రోచ్ఛరణల మధ్య దంపతులు సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



సారంగాపూర్: జగిత్యాల– సారంగాపూర్ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి గ్రామం ఎస్టీ కాలనీ సమీపంలో రహదారిని ఆనుకొని భారీ వేప చెట్టు పూర్తిగా ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ చెట్టు ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ రహదారిపై అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో చెట్టు చెట్టు ఎప్పుడు కూలుతుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి ఎండిన వృక్షాన్ని తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్, ఎంపీడీవో, కథలాపూర్ సెల్ నం.: 8919654618

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పని చేయాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు. తమ వార్డుల్లో పలు చోట్ల వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి పూట ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్లు లంక గంగాధర్, అంగడి పురుషోత్తం, ఒజ్జెల బుచ్చిరెడ్డి తెలిపారు. నాలాలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కౌన్సిలర్ చెట్లపల్లి మీనా కోరారు. సమావేశంలో 13 అంశాలను ప్రవేశపెట్టగా, వాటిని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి

మల్లాపూర్: టీటీడీ దేవస్థాన బోర్డు సహకారంతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వేంపల్లి శివాలయ అభివృద్ధికి టీటీడీ నిధులు రూ. 10 లక్షలు మంజూరు కాగా, సోమవారం స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిట్ల సరోజన, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మల్లేశ్ యాదవ్

రాయికల్: యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన గన్నవేని మల్లేశ్‌యాదవ్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని గుడేటి రెడ్డి సంఘ భవనంలో సోమవారం అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సలహాదారులుగా తొట్ల చిన్నయ్య, రెబ్బాస్ మల్లయ్య, కొల్ముల రమణ, బల్కం మల్లేశ్, దండవేని మల్లయ్యయాదవ్, ముక్కెర శేఖర్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మాదం వినోద్‌యాదవ్, అంకం శంకర్, కొక్కెర శేఖర్, ప్రకాశ్‌యాదవ్‌తో పాటు మండల, పట్టణ ఇన్‌చార్జీలను నియమించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వేణుగోపాల్

రాయికల్: ఎమ్మార్పీఎస్ రాయికల్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లీపూర్ గ్రామానికి చెందిన వేణుగోపాల్, అధికార ప్రతినిధిగా తాట్లవాయికి చెందిన పాలెపు సురేశ్, ఉపాధ్యక్షుడిగా కిష్టంపేటకు చెందిన నక్క భూమేశ్, ప్రధాన కార్యదర్శి బెక్కం వెంకటేశ్ (రామాజీపేట), ప్రచార కార్యదర్శిగా కండ్లపల్లి రమేశ్ (రామాజీపేట), మారంపల్లి గంగారెడ్డి (కిష్టంపేట) ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్

ఇబ్రహీంపట్నం: ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీధర్‌ను ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను సోమవారం డబ్బా గ్రామంలో మాజీ ఎంపీటీసీ దెౌట్టి శాంత, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్యలు ఘనంగా సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో జాన శంకర్, గోపి రాజేందర్, యేసురత్నం, సుభాష్‌గౌడ్, గుంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ

కథలాపూర్: మండలకేంద్రంలో ఎరువులు, విత్తనాల విక్రయాల దుకాణాలను ఏవో యోగితా సోమవారం తనిఖీ చేశారు. అన్ని దుకాణాల్లో రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు విత్తనాలు విక్రయిస్తే తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని, స్టాక్ వివరాలు రికార్డులను సక్రమంగా నమోదు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- **శరవేగంగా సర్వే ఆన్‌లైన్ నమోదు**

మల్యాల: మండలంలోని సామాజిక, రాజకీయ, ఉపాధి, కుల గణన సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేస్తున్నామని ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండలంలోని 17,061 ఇళ్లలో సర్వే పూర్తిచేశామని, ఈ నెల 30వరకు ఆన్‌లైన్ పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

- **201 మంది అయ్యప్ప దీక్ష**

కోరుట్లరూరల్:పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా సోమవారం ఒకేరోజు 201 మంది స్వామివారి దీక్ష స్వీకరించారు. స్వాములకు పురోహితుడు రాము శర్మ, గురుస్వామి చిద్రాల నారాయణ స్వామి మాల వేశారు. అనంతరం అయ్యప్ప మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం చేశారు.

- **యువకులు పెడదారి పట్టొద్దు**

ఇబ్రహీంపట్నం: యువకులు పెడదారి పట్టొద్దని, చెడు అలవాట్లు చేసుకోవద్దని ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పోనకంటి వెంకట్ అన్నారు. మండలంలోని వర్షకొండలో యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.

- **హస్నాబాద్‌లో వ్యక్తి ఆత్మహత్య**

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన మారంపల్లి రాజేశ్ (36) సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేశ్‌కు కొడుకు, కూతురు సంతానం. రాజేశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

- **ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ**

కోరుట్ల: మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు సీతమ్మవారి మెడలోని బంగారం ఎత్తుకెళ్లినట్లు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచారి తెలిపారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

- **అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రసాన**

రాయికల్: పట్టణంలోని ఒడ్డెరకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, ఆయా పాల్గొన్నారు.